నవతెలంగాణ
నమ్మకం తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | ఏప్రిల్ 14, 2024 | www.navatelangana.com

పోలీసుల తనిఖీల్లో రూ.80వేల నగదు పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సెర్పెల్లి గ్రామ సమీప చెక్‌పోస్ట్ వద్ద శనివారం రూ.80వేల నగదు పట్టుబడింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా భైంసా నుంచి మహారాష్ట్రలోని పాలజ్ గ్రామం వైపుకు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న జలాల్ వద్ద నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించినా, మద్యం, డబ్బు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బొలెరో : ఆరుగురికి గాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొరిటికల్ గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..నేరడిగొండ నుండి వెళుతున్న ట్రాక్టర్ కొరిటికల్ గ్రామం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా కర్నాటక నుండి యూపీకి వెళుతున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో యూపీకి చెందిన బొలెరో వాహనంలో ఉన్న ఆరుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కుమార్‌సింగ్, ఆయుష్ కుమార్‌సింగ్, నీబాసింగ్, బిట్టు(12)ను హైదరాబాద్‌కు తరలించారు. ట్రాక్టర్‌పై ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం





నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఆర్ఐ దేవిక తెలిపిన వివరాల ప్రకారం..శనివారం తాలారి శ్రీనివాస్ దంపతులు ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. ఉన్న ఫలంగా మంటలు చెలరేగి ఇల్లు తగలబడుతుండగా ఇంటి పక్కవారు చూసి శ్రీనివాస్‌కు తెలిపారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పేశారు. ప్రమాదంలో ఇంట్లో దాచుకున్న రూ.50వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. పంచనామాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు గుర్తించామన్నారు. మొత్తం మీద రూ.2.50లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని సొంపల్లిగూడ, ఇట్యార్‌గూడ గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్, బీజేపీలు గ్రామాల్లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కుమురం కోటేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పాల్గొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు అన్నదానం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన పాత్రికేయుడు రాజ్‌కుమార్‌రెడ్డి తల్లి చిన్నోళ్ల రుక్మవ్వ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం నిర్మల్‌లోని కొండాపూర్ మానసిక వికలాంగుల కేంద్రంలో వికలాంగులకు, ప్రియదర్శినినగర్‌లోని వృద్ధాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు స్వప్న, మాజీ సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడుగు జీవులకేదీ సంక్షేమం..!

- జిల్లాలో ఏండ్లు గడుస్తున్నా కనిపించని పురోగతి
- ప్రభుత్వ పథకాలతో కొందరికే ప్రయోజనం
- ఆర్థికాభివృద్ధిలో ఇంకా అట్టడుగు పరిస్థితే
- కార్మికులు..వ్యవసాయ కూలీలుగానే జీవనం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74ఏండ్లు గడుస్తున్నా బడుగు జీవుల బతుకులు మారడం లేదు. పేదరికం రూపుమాపుతామని, దళితులు, బలహీనవర్గాల జీవితాల్లో మార్పులు తీసుకొస్తామని చెబుతున్న పాలకుల మాటలు నీటి మీద రాతలుగా మిగిలిపోతున్నాయి. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులకు అందడం లేదు. ఆయా పథకాలు అరకొర మందికే ప్రయోజనం చేకూరుస్తున్నాయి. తప్పితే నిజమైన అర్హులకు అందని ద్రాక్షగానే మారుతున్నాయనే విమర్శలున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబస్తీ పథకంతో ఆదిలాబాద్ జిల్లాలో కొంతమందికి వ్యవసాయ భూములు సమకూరినా..ఇంకా అనేక కుటుంబాలకు దరిచేరలేదు. దీంతో వ్యవసాయ కూలీలుగా.. నిర్మాణ రంగంలో కార్మికులుగా పనిచేస్తూ అందులోనే మగ్గిపోతున్నారు. వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు మధ్య దళారుల దోపిడికి గురవుతున్నాయి. తప్పితే దళితులు, గిరిజనులు, మిగతా బలహీనవర్గాల దరికి చేరడం లేదనే విమర్శలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెట్టాయి. వాటి అమలుకు కాగితాల్లో నిధులు కేటాయిస్తున్నా.. విడుదల చేయడంలో మాత్రం తీవ్రజాప్యం జరుగుతోంది. ఫలితంగా పథకం ప్రవేశపెట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. ఫలితంగా ఏండ్లు గడుస్తున్నా దళితుల జీవితాల్లో మార్పులు రావడం లేదు. పొట్టకూటి కోసం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు కొందరికే పరిమితమవుతున్నాయి. గత ప్రభుత్వం ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల చొప్పున వ్యవసాయ భూమి పంపిణీ చేస్తామని చెప్పింది. జిల్లాలో 30,565 కుటుంబాలు షెడ్యూల్ కులాల కుటుంబాలు ఉండగా వీటి పరిధిలో 1,12,932 జనాభా ఉంది. ఇప్పటి వరకు 11,182 కుటుంబాలు మాత్రమే వివిధ పథకాల కింద లబ్ధి పొందినట్లు అధికారులు చెబుతున్నారు. దళిత బస్తీ పథకం కింద ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు రూ.208.27కోట్లతో 1883 కుటుంబాలకు 4787.34ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేసింది. వీటికి పెట్టుబడి కోసం లబ్ధిదారులకు రూ.8.40కోట్లు అందించారు. వీటితో పాటు అసైన్డ్, పట్టా భూముల్లో నీటి వసతి కల్పించడం కోసం 375 బోరుబావులు మంజూరు చేయగా 244 బోరుబావులకు డ్రిల్లింగ్ చేశారు. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కోసం 97 రకాల పథకాలు అందించగా 3632 మంది లబ్ధిదారులకు ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, బ్యూటీపార్లర్లు, టెంట్‌హౌస్ తదితర వాటి కోసం రూ.68.12కోట్లు అందించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగితా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో దళితబస్తీ పథకం చాలా తక్కువ మందికి భూ పంపిణీ చేశారు. మరోపక్క దళితబంధు పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి 100కుటుంబాల చొప్పున వెయ్యి మందికి రూ.100కోట్లను అందించారు. మిగితా వేలాది కుటుంబాలు ఈ పథకం కోసం వేచిచూసినా..అప్పటి ప్రభుత్వం జాప్యం చేయడంతో పాటు అధికారం కోల్పోవడంతో ఈ పథకం అర్థాంతరంగా నిలిచిపోయింది.

కొత్త సర్కారుపై ఆశలు..!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో దళితులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆశతో ఉన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి కొంత మందికి మాత్రమే రుణాలు అందించగా.. వేలాది కుటుంబాలకు ప్రయోజనం లేకుండా పోయింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు కార్పొరేషన్లను పునరుద్ధరించడంతో పాటు వాటికి ఛైర్మెన్లను నియమించారు. ప్రతి కులానికి ఓ కార్పొరేషన్ చొప్పున ఏర్పాటుచేయడంతో వాటి ద్వారా ఆయా పథకాలు, ఆర్థికాభివృద్ధి కోసం సబ్సిడీ రుణాలు వంటి వాటిని అమలు చేస్తుందని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీలకు ప్రతి ఏటా అందించాల్సిన సబ్సిడీ రుణాలను రద్దు చేసి వాటి స్థానంలో దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. కానీ అతి కొద్ది మందికి మాత్రమే ఈ పథకం వర్తింపజేయడంతో అనేక మందిలో నిరుత్సాహం ఉంది. గతంలో మాదిరి సబ్సిడీ రుణాలు అందిస్తే వాహనాలు కొనుగోలు చేయడం, చిరువ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో ప్రభుత్వాలు అందించిన రాయితీ రుణాలతో వందలాది కుటుంబాలు ప్రయోజనం పొందిన సందర్భాలున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇదే మాదిరి రుణాలు అందిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీజేపీని ఓడించడమే వామపక్షాల లక్ష్యం

వామపక్షాల సదస్సులో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాజ్యాంగ రక్షణ కోసం ప్రజలందరూ సిద్ధమై రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడిచాయని, ఈ పదేండ్ల కాలంలో దేశ ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పని చేయలేదని విమర్శించారు. దేశ సార్వభౌమత్వాన్ని, లౌకిక విలువలను, ప్రజాస్వామ్యాన్ని పాతరేసేలా పాలన సాగించిందని మండిపడ్డారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభజనను తీసుకొచ్చే ప్రయత్నం చేయడమే కాకుండా అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ సీఏఏ వంటి చట్టాలను తీసుకువచ్చిందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా పరిపాలన సాగించిందని, ప్రజాస్వామ్య హక్కులను ఫెడరల్ స్ఫూర్తిని కాల రాసిందని ధ్వజమెత్తారు. 16 రాష్ట్రాల్లో ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేసి దొడ్డి దారిన ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ, ఈడీలను జేబు సంస్థలుగా వాడుకుంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులను బనాయిస్తూ ఇబ్బందులు పెట్టే పని చేస్తోందని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు బీజేపీలో చేరితే వారిపై కేసులు ఎత్తివేస్తోందని తెలిపారు. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను అవలంభిస్తూ ప్రజలపై అనేక ఆర్థిక భారాలను మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల పన్ను రాయితీలను ఇచ్చిందని, అధిక ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశానికి అంటేలా చేసిందన్నారు. మరోవైపు ప్రజల నిజ వేతనాలు పడిపోతున్నా అత్యధిక మంది ప్రజలు దారిద్ర్యరేఖ కిందకు దిగివస్తున్నా బీజేపీ మాత్రం కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెట్టడంలో మాత్రమే శ్రద్ధ చూపుతోందన్నారు. మరోవైపు ఏ ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ప్రారంభించకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని కార్పొరేట్లకు కారు చౌకగా ధారాదత్తం చేస్తోందని, దానికి ప్రతిఫలంగా ఎన్నికల బాండ్ల రూపంలో వేలకోట్ల నల్లధనాన్ని కార్పొరేట్ కంపెనీల నుండి చందాల రూపంలో సేకరించిందని తెలిపారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పన విషయంలో ఘోరంగా విఫలమైందని, ఆ పార్టీ అవలంబించిన ఆర్థిక విధానాల ఫలితంగా జీడీపీ తగ్గడమే కాకుండా రూపాయి విలువ దారుణంగా దిగజారిందని గుర్తు చేశారు. ఈ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను అవలంభిస్తూ మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓడించడమే దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యమని తెలిపారు. స్వాతంత్రోద్యమ అమరవీరుల స్ఫూర్తితో దేశాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీని ఓడించాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలోనూ బీజేపీని ఓడించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కార్యదర్శివర్గ సభ్యుడు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అమీనా, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ప్రభాకర్, జిల్లా కార్యదర్శి నంది రామయ్య, జిల్లా కమిటీ సభ్యులు బి.జగన్‌సింగ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే.రాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్‌నారాయణ, నాయకులు స్వామి, గణేష్, కళావతి, గంగన్న, ఆశన్న పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కేటీఆర్ దొరతనం ఇంకా పోలేదు

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, పక్కన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇంకా దొరతనం ప్రదర్శిస్తున్నాడని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. డమ్మీ అభ్యర్థులను పెట్టారంటూ ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ పేరు ప్రస్తావించడం చూస్తుంటే దొరతనం ఇంకా ప్రదర్శిస్తున్నాడని అర్థమవుతోందని తెలిపారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎంపీ అభ్యర్థి సుగుణక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పేదలకు అండగా ఉండే పార్టీయేనని, బలుపు ఉన్నవారికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వదని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ అభ్యర్థి బొజ్జు చేతిలో కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్ పరిస్థితి ఏమైందనేది అప్పుడే మర్చిపోయారా అని ప్రశ్నించారు. పేపర్ బాయ్‌గా పని చేసిన వ్యక్తి ఎమ్మెల్యే అయ్యారని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పేద సుగుణక్కని గెలిపించి దొరకు మరోసారి బుద్ధి చెప్పాలని తెలిపారు. దేవుని పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. అయోధ్యలో గుడి కట్టానని చెబుతున్న మోడీ ఎన్ని బడులు ప్రారంభించారో చెప్పలేకపోవడం దారుణమన్నారు. దేవున్ని అందరం పూజిస్తామని, కొత్తగా బీజేపీ చేసేదేమీ లేదన్నారు. అక్షింతలు కాదు ఉద్యోగాలు ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఆదిలాబాద్ వచ్చినప్పుడు మోడీ ఆదివాసీ ప్రాంతానికి ఏమైన హామీలు ఇస్తాడని ఆశపడ్డామని, కనీసం ఈ ప్రాంతం గురించి మాట్లాడకపోవడం ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలియజేస్తోందని విమర్శించారు. 75 సంవత్సరాల తర్వాత మహిళ అభ్యర్థికి అవకాశం వచ్చిందని, ఆమెను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. దేశంలో బీజేపీని వ్యతిరేకించే నాయకులపై ఈడిని పంపిస్తున్నారని, పక్కన మహారాష్ట్రలో అశోక్ చౌహన్‌కు ఈడి నోటీసులు ఇచ్చి ఆయన బీజేపీలో చేరగానే రాజ్యసభ పదవి ఇచ్చారని ఆరోపించారు. రాజీవ్ గాంధీ తర్వాత ఆ కుటుంబానికి చెందిన వారెవరూ ప్రధానమంత్రి కాలేదని, ఇది వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందన్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనా అన్నారు. జోడేఘాట్ అభివృద్ధిపై ఆ రెండింటికీ ఎటువంటి పట్టింపు లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం వెంటనే అక్కడి ఆదివాసుల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మోక్షం వచ్చిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సక్కు, బీజేపీ అభ్యర్థి నగేష్ గతంలో చట్టసభల్లో పనిచేశారని, ఏనాడూ ఆ ప్రాంతం గురించి మాట్లాడలేదన్నారు. ఇంత కాలం బీజేపీ ఎంపీ ఉన్నప్పటికీ గిరిజన యూనివర్సిటీ, పేపర్ మిల్ లాంటి ఏ ఒక్క అభివృద్ధి పరమైన పరిశ్రమ రాలేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ మాట్లాడుతూ ఇతరులు ఫోన్లు మాట్లాడుతుంటే వినే పార్టీ నుండి స్వేచ్ఛ వాయువులు వీచే కాంగ్రెస్‌కు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ లిక్కర్, బీజేపీ మతతత్వ పార్టీ అని ఆరోపించారు. తెలంగాణ సంపదను కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత దోచుకున్నారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ ఆడబిడ్డగా కొంగు చాచి అడుగుతున్నానని, పేదరాలైన తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఒకింత ఉద్వేగంగా అన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లా నాయకులు బాలేష్‌గౌడ్, అనిల్, ఆసిఫ్, చరణ్, మంగ, మునీర్, రమేష్, రాజేంద్రకుమారి, కళావతి పాల్గొన్నారు.

హాజరైన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఏప్రిల్ 14, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కడెం

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ క్యాంపు కార్యాలయంలో శనివారం మండలంలోని నర్సాపూర్ మాజీ సర్పంచ్ కుడ్మేత బాజీరావుతో పాటు వార్డు సభ్యులు జాడి జనార్ధన్, రమేష్, రాజన్న, శేఖర్, రాములు, రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించడానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లో పతాకావిష్కరణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాడిన తర్వాత టీఎస్ యూటీఎఫ్ పదేండ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకొని ఉపాధ్యాయులకు వెంటనే మూడు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీధర్, గురుకులాల కన్వీనర్ అనీల్ కుమార్, మండల బాధ్యులు కొంపెల్లి రాజేందర్, రమేష్, నారాయణ, రాజు పాల్గొన్నారు.



అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతో దళితులకు రిజర్వేషన్లు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో దళిత, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన కులాలకు ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్‌లు కల్పించిందని సీనియర్ అసిస్టెంట్ వావల్కర్ మనోహర్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడారు. ఆ రిజర్వేషన్ ఫలితంగానే నేడు అనేక మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడటం సంతోష దాయకమన్నారు. ఆయన భారత దేశానికి అంకితం చేసిన రాజ్యాంగం వల్ల నేడు దళితులకు విద్య విషయంలో రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ఆ నాడు రెండు గ్లాసుల పద్ధతితో పాటు అంటరానితనం ఉండేదన్నారు. దళితులపై సమాజంలో వివక్ష చూపేవారన్నారు. ఆయన రాసిన రాజ్యాంగంతోనే నేడు దళితులు స్వేచ్ఛ వాతావరణంలో జీవిస్తున్నారు. అటువంటి మహనీయునికి ప్రభుత్వం భారతరత్న బిరుదుతో సత్కరించిందన్నారు. అటువంటి మహనీయుని జయంతిని ప్రతి వాడవాడలా, కార్యాలయాల్లో వైభవంగా నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్నాం


నవతెలంగాణ-బేల



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్నామని మెస్రం నాగేశ్వర్ అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తమది మండలంలోని సోన్‌ఖాస్ గ్రామమని నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికి కష్టపడి చదివాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పీహెచ్‌డీ జువాలజీ విభాగంలో పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తెలంగాన మహిళా విశ్వవిద్యాలయం ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేస్తున్నాను. అంబేద్కర్ తమకు స్ఫూర్తి ప్రధాత పేర్కొన్నారు.

రిజర్వేషన్ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగం

నవతెలంగాణ-ఉట్నూర్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ఆధారంగానే ప్రభుత్వం ఉద్యోగం సాధించామని ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు అన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడువాలని అన్నారు. ఉన్నత చదువులు చదివి ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు.

ఏజెన్సీ దళితులకు సరైన సంక్షేమ పథకాలు అందడం లేదు

నవతెలంగాణ-నార్నూర్



తరతరాలుగా ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న దళితులకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందడం లేదని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్, ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్య సమితి జిల్లా అధ్యక్షుడు మోటేరావ్ అనిల్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు అందక వెనుకబడి ఉన్నామన్నారు. తాము సాగు చేస్తున్న భూమికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదని, దానితో బ్యాంకులో రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ లోన్‌కు గత పది సంవత్సరాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాని లోన్ ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, రైతు భీమా వంటి అనేక సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి కృషి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ లోన్ ప్రతి సంవత్సరం మంజూరు చేయాలని కోరారు.

రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నాం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వాటి ద్వారా పొందిన రిజర్వేషన్ ఫలాలను పొందుతున్నామని ఏఈఓ దుర్గం కరుణ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. అంబేద్కర్ భారత జాతికి అంకితం చేసిన రాజ్యాంగంతోనే ఈ రోజు దళిత, బహుజనులకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయి. రిజర్వేషన్ వల్ల నేడు భారత దేశ అత్యున్నత పదవి ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నిక చేశారు. నేడు మహిళలకు చట్ట సభలతో పాటు ఉద్యోగ, రాజకీయాల్లో 33శాతం రిజర్వేషన్ అమలులో ఉందని పేర్కొన్నారు. ఇన్ని చట్టాలు తెచ్చిన ఇంకను మహిళలపై రోజు రోజుకు లైంగిక వేధింపులు, ఆ త్యాచారాలు వరకట్న బలన్మరణాలు జరుతూనే ఉన్నాయి. దానిని రూపు మాపడానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని చట్టాలు ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని కోరారు.

నలబై దేశాల కరెన్సీలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకేర ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం ఇంటర్నేషనల్ ఉమెన్స్ రైట్స్ ఆర్గనైజేషన్ బాశెట్టి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు కరెన్సీ నోట్లు నాణేలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతకాలపు సంబంధించిన కరెన్సీ నోట్లు నాణేలు వాటిని విలువలు ఎలా ఉన్నాయో వాటిపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ప్రయత్నాలు ఉపాధ్యాయుడు కమలాకర్, ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు విజయ్, శ్రీరామ్, అంగన్‌వాడీ కార్యకర్త సుశీల పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు లౌకిక వాదులు ఐక్యం కావాలి

- మతోన్మాద బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య

నవతెలంగాణ-నిర్మల్

రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు లౌకిక వాదులు ఐక్యం కావాలని, మతోన్మాద బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు ఎం.అడివయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దశాబ్ద కాలంగా సాగించిన పాలనతో లౌకికవాద, ప్రజాస్వామ్యం ప్రమాదంలోపడిందని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని దుర్వినియోగం చేస్తూ, నిరంకుశవాద, మతోన్మాద మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు ఫాసిస్ట్ పద్ధతులను ఉపయోగిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను తిప్పికొట్టాలని అన్నారు. పని హక్కును రాజ్యాంగ హక్కుగా చేర్చాలని, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ఉపాధికి హామీ కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించాలని అన్నారు. నిరుద్యోగ భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య ప్రయివేటీకరణను ఆపాలని వాణిజ్యీకరణ, మతతత్వకరణ, కేంద్రీకరణ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న వికలాంగుల చట్టాలను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశంలో అన్ని రంగాల్లో 40.57కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని అన్నారు. 2022-23 సంవత్సరంలో నిరుద్యోగం 7.6శాతం పెరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 10లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. నైపుణ్యం గల కార్మికులకు రూ.26,000 కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య 19నుంచి 42.5 శాతానికి పెరిగిందని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి 2023-24 సంవత్సరంలో నిధులను 1.33 శాతానికి తగ్గించారని అన్నారు. దేశంలో 32శాతం ప్రజలు పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్నారని నీతి ఆయోగ్ రిపోర్ట్ వెల్లడించిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితుల మీద దాడులు, అత్యాచారాలు, పెరుగుతున్నాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, బి. సుజాత, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, గంగామణి, ఇప్ప. లక్ష్మణ్, నాయకులు పోశెట్టి, నాగెల్లి నర్సయ్య, ముత్తన్న, లలిత, ప్రసాద్, లక్ష్మి, పోశెట్టి, సాయికిరణ్, రాజేశ్వర్, నవీన్ పాల్గొన్నారు.

కూలీలు ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

కూలీలు ఉపాధి హామి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఉపాధి హామి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కూలీలు ఉపాధి హామి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కూలీలను కోరారు. అనంతరం సుగుణ మాట్లాడుతూ ఆ నాడు ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చి 100 రోజుల పని కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఉపాధి హామి రోజు వారి కూలీ రూ.200 నుంచి రూ.400 పెంచుతున్నట్టు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదుగురు గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్ : డీఎస్పీ నాగేందర్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

నవతెలంగాణ-ఉట్నూర్

ఐదుగురు గంజాయి ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్టు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రం శివారులో ఇద్దరు వ్యక్తులు గంజాయి తీసుకొస్తున్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు ముత్నూర్ గ్రామ సమీపంలో 510 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. ముఠాను అదుపులోకి తీసుకోని డి.రాకేష్, ఎం. రాంచరణ్‌లను వివరాలు అడగగా మరో నలుగురు ఉన్నారని తెలిపారు. వారి దగ్గర 550 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పట్టుబడ్డ గంజాయి 1కిలో 60 గ్రాములతో పాటు ఒక అక్టివా ద్విచక్ర వాహనం, రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం మంగేలా గ్రామానికి చెందిన దూంపేట రాకేష్(24), 2. జగిత్యాల జిల్లా పర్మల మండలానికి చెందిన ముద్దం రాంచరణ్(20), 3. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన మెస్రం షేక్కు, 4.ఆదిలాబాద్ రూరల్ మండలం బొప్పాపూర్‌కు చెందిన మెస్రం రవీందర్(22), 5. కుమ్ర రాంజీ(24), ఈ విలేకరుల సమావేశంలో సీఐ మోగిలి, ఉట్నూర్ ఎస్సై మనోహార్, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్ పాల్గొన్నారు.

ఆశాలపై ప్రభుత్వాలు మొండి వైఖరి విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్

ఆశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆశాలకు రావాల్సిన మార్చి నెల పారితోషకం ఇప్పటి వరకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. ప్రభుత్వం చాలిచాలని పారితోషకంతో వేరే పనులు చేసుకోరాకుండ చేస్తున్నాయన్నారు. ఈ వేతనాలతో కుటుంబాలు గడవడం దయానీయంగా మారిందన్నారు. మరోవైపు అధికారుల ఒత్తిడి, పని భారంతో సతమతమవుతున్నారని అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు పారితోషాకాలు ప్రభుత్వాలు ఆశాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగామణి, లక్ష్మి, పోశెట్టి, జావర పోశెట్టి పాల్గొన్నారు.

కప్పర్‌దేవి అటవీ ప్రాంతంలో చిరుతపులుల సంచారం

తలమడుగు : మండలంలోని కప్పర్‌దేవి గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం రెండు చిరుతపులులు సంచరిస్తున్నట్టు గ్రామస్తులు పెందూర్ శంకర్, జుగ్నాక్ రమేష్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరి కొంత మంది కలిసి సాయంకాలం తమ చేను పనులకు వెళ్లగా రెండు చిరుత పులులు కనిపించినట్టు వారు తెలిపారు. కొద్ది మీటర్ల దూరంలోనే చిరుతపులులు ఉండటంతో వాటిని చూసి భయపడి తిరిగి ఇంటి దారి పట్టినట్టు తెలిపారు. అదేవిధంగా తమ వద్ద గ్రామానికి చెందిన కుక్కలు ఉండటంతో చిరుత పులుల నుంచి రక్షించుకున్నట్టు తెలిపారు. చుట్టుపక్క గ్రామాలైన డోర్లి, పల్సి(కే), పల్సి(బి), పల్సి(బి) తండ, ఉమ్రి, కోసాయి, దేగామ, గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వెంటనే అటవీ అధికారులు అటవీ ప్రాంతాన్ని సందర్శించి, మనుషులకు, పశువులకు, ప్రాణహాని, కలగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఝరి, తలమడుగు, కుచులాపూర్, ఉమ్రి, గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెల్లకల్లు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ శాఖ ఇన్స్‌పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. మండలంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తెల్లకల్లు విక్రయాలు జరిపినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తెల్లకల్లు ప్యాకెట్లను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే పోలీసుల కవాతు



నవతెలంగాణ -ముధోల్

ప్రజల భద్రతకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నట్టు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. శనివారం ముధోల్ మండల కేంద్రంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు మల్లేష్, ఏపీ రావ్, పుండలిక్, ఎస్ఐ సాయికిరణ్, 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీస్ కానిస్టేబుల్ 15 మంది పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కడెం

మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో శనివారం గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గౌతమబుద్దుడికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆ మహనీయుడి సిద్ధాంతాలను, ఆలోచనలను నిత్య జీవితంలో పాటించినప్పుడే అదే ఆ మహనీయునికి మన మిచ్చే బహుమానమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆ మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, దళిత, బహుజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రైబల్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ట్రైబల్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ట్రైబల్ జర్నలిస్ట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు లాకావత్ రమేష్ అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని పూలాజీ బాబా కళాశాలలో, ట్రైబల్ జర్నలిస్టల సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ట్రైబల్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో పిల్లలకు ఉచిత విద్య, కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం లోగోలను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, ప్రధాన కార్యదర్శి మాడవి మాణిక్‌రావు, చవాన్ రమేశ్వర్, కోశాధికారి జాదవ్ వసంత్‌రావు, సభ్యులు భీంరావ్, సిద్దార్థ, రవికిరణ్, సురేష్, మెస్రం రవి, మాడవి దత్త్రాత్రి, మెస్రం ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు మాజీ సర్పంచులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలానికి పలువురు సర్పంచులు శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని వాల్గొండకు చెందిన మాజీ సర్పంచులు కినక జుగాది రావ్, హీరాపూర్‌కు చెందిన గోడం నాగోరావ్‌లు వారి సమక్ష్యంలో కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. తాము కాంగ్రెస్‌లోనే ఉంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ముఖాడే ఉత్తం, మెస్రం నాగనాథ్, నాగోరావ్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | ఏప్రిల్ 14, 2024 | www.navatelangana.com

సిర్పూర్ ఎమ్మెల్యే వాహనం తనిఖీ

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని మెట్టపిప్రి రోడ్డు వద్ద ఏఎస్సై బాల్ సింగ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఆదిలాబాద్‌లో జరిగిన సమావేశాన్ని ముగించుకొని ఆదిలాబాద్ నుండి తిరిగి వస్తున్న కార్యక్రమంలో మెట్టపిప్రి వద్ద ఏఎస్సై బాల్ సింగ్ సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు వాహనాన్ని తనిఖీ చేశారు. పోలీసులను ఎమ్మెల్యే సహకరించి వాహనాన్ని తనిఖీ చేయించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బులు రవాణ కాకుండా ఈ తనిఖీలు జరుగుతున్నాయి.

పోలీసుల కవాతు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని డబ్బా, ఆడేపల్లి గ్రామాల్లో ఎస్సై నరేష్, ఏఎస్సై యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, టీఎస్ఎస్పీ సిబ్బందితో ప్రధాన రహదారి గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భయాభ్రాంతులకు గురికాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా తాము పూర్తిగా సిద్ధమనే భరోసా కల్పించేలా కవాతు నిర్వహించామని ఎస్సై తెలిపారు. ఇందులో 40 మంది టీఎస్ఎస్పీ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని తమ సంఘంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని టీఎస్ యూటీఎఫ్ ఐక్య గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడు దూలం ఎల్లయ్య అన్నారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూటీఎస్‌యూటీఎఫ్ ప్రాంతాలు, యాజమాన్యాలు, క్యాడర్లు, కులాలు, మతాల అంతరాలను అధిగమించి రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ ఒకే సంఘం ఉండాలనే ఆశయంతో చారిత్రక అవసరంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) లక్ష్యాలు, ఆశయాల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) పురోగమిస్తున్నదని గుర్తు చేశారు. హక్కులు బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో దశాబ్ద కాలంగా సేవలందిస్తూ ఉపాధ్యాయుల మన్ననలు పొందుతూ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నదన్నారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యలపై సెక్టార్ వారీగా విభాగాలను ఏర్పాటు చేసి ఆయా ఉపాధ్యాయులను సంఘటితం చేసి ఉద్యమాలు నిర్వహించి ఫలితాలను సాధించిందని, అఖిల భారత ఉపాధ్యాయ ఉద్యమంలో సైతం టీఎస్‌యూటీఎఫ్ క్రియాశీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి టి. రమేష్, జిల్లా నాయకులు ఉశన్న, కోట తిరుపతి, సింగతి ఉపేందర్, నరేందర్, దేవాజి, శ్రీనివాస్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- మంత్రి సీతక్కకు ఏఐటీయూసీ నాయకుల విన్నపం

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ కోరారు. శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 జూలై, ఆగస్టు నెలలో కార్మికుల వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేయడం జరిగిందని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటీని చర్చలకు పిలిపించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నాడు సమ్మె విరమించామన్నారు. కార్మికులందరికి జీవిత బీమా సౌకర్యం రూ.ఐదు లక్షలు కల్పిస్తామని డీపీఓలకు పంపించారని తెలిపారు. కానీ నేటికి అనేక జిల్లాల్లో జీవిత బీమా సౌకర్యం కల్పించకపోవడంతో ట్రాక్టర్, ఇతర ప్రమాదాల్లో కార్మికులు మరణించిన ప్రభుత్వం నుండి ఎలాంటి బీమా సౌకర్యం అందలేదన్నారు. ఒకటవ పే కమిషన్ నిర్ణయించిన మినీమం బేసిక్స్ ప్రకారం రూ.19 వేలు వేతనంగా చెల్లించాలని, ఆలోపు జీఓ నెంబర్ 60 ప్రకారం స్లీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లకు, ఎలక్ట్రీషన్‌లకు, డ్రైవర్లకు, కారోబార్‌లకు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలని, జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలన్నింటినీ యధావిధిగా అమలుచేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబసభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి కూడా రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ పథకం అమలుచేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు పండుగ, జాతీయ ఆర్జిత సెలవులు మంజూరుచేయాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామపంచాయతీ అవసర ప్రాతీపాదికన కార్మికులను నియమించుకోవాలని, ట్రాక్టర్ డ్రైవర్లందరికి పంచాయతీల ద్వారా డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించాలని, సంవత్సరానికి మూడు జతల యూనిఫామ్, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకర్, వెంకటేష్, రమేష్, దేవాజీ, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల ఆరాధ్య దైవం అంబేద్కర్

- న్యాయవాది కుడిమెత శ్రీనివాస్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



డా. భీంరావు అంబేద్కర్ అసాధారనం అనడం కంటే ఆయన ఒక శక్తిగా చెప్పుకోవచ్చు. ఆయన భారతదేశపు న్యాయ వేత్త, సంఘ సంస్కర్త, రాజకీయ వేత్త, అన్నింటీకి మించి ఆయన భారత రాజ్యాంగ సృష్టి కర్త. దేశంలో రాజ్యాంగం నిలిచివున్నంత కాలం ప్రజల గుండెల్లో ఆయన ఉంటారు. అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేశారు. కులం పేరుతో దూషించడాన్ని అడ్డుకున్న మొదటి వ్యక్తి. అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని పౌరులు ఎదగడమే నిజమైన దేశ అభివృద్ధి అని చెప్పిన మహనీయుడు అంబేద్కర్. బానిసత్వాన్ని ఎవరికి వారు పోగొట్టుకోవాలని ఇతరుల మీద ఆధారపడకూడదని బలహీన వర్గాల ప్రజలకు ధైర్యమిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని అతిపెద్ద ప్రజాస్వామ్య భారత రాజ్యాంగాన్ని లిఖించి ఇచ్చిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్. ఇలాంటి వ్యక్తి మన దేశంలో పుట్టడం గర్వకారణం. నేటి యువత ఆయన ఆశయాలను సాధించాలంటే విద్యలో రాణించడమే ప్రధానం.

నేటి అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతిని ఆదివారం నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, విజయ్, అశోక్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని కమాన, ఇందానీ, కన్నర్‌గావ్, ఎనగొంది, లొద్దిగూడ తదితర గ్రామాల్లో ఆదివారం జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం జెండా ఆవిష్కరణ, సాయంత్రం శాంతియుత ర్యాలీ అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హక్కులు కాపాడే రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం
- కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-రెబ్బెన

పేదల హక్కులు కాపాడే రాజ్యం రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ బిడ్డ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలన్నారు. శనివారం మండలంలో పార్టీ ఎంపీ అభ్యర్థి తరపున నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దుకాణ యజమానులకు కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ అభ్యర్థిని మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ పదేండ్లలో బీజేపీ పాలనలో జిల్లాకు ఏం చేశారని, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఆదివాసీ బిడ్డ మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడే ఆదివాసీ బిడ్డను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించి వ్యూహాలపై శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా అందరు ఏకతాటిపైకి వచ్చి బేషరతుగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్యాగాల కుటుంబం గాంధీ కుటుంబమన్నారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు పదువులు కట్టబెట్టిన త్యాగమూర్తులని గుర్తు చేశారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా



దుకాణాల్లో కరపత్రాలు అందజేస్తున్న మంత్రి సీతక్క

పోరాటాలు చేస్తున్న తమ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ అని, బావిభారత ప్రధానిగా చూడడమే లక్ష్యమన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్, బీజేపీ ప్రజలకు చేసిందేమీలేదని ఆమె గుర్తు చేశారు. ఈరోజు భక్తి, భగవంతుడి పేరుతో రాజకీయాలు చేస్తూ బీజేపీ పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను ఎలా ఎండగట్టామో అదేవిధంగా పార్లమెంటు ఎన్నికల్లో ఆ దిశగానే ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యకర్తలందరి కృషితో రాష్ట్రంలో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. ఊర్లలోకి వచ్చే బీఆర్ఎస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు వస్తే నిలదీయాలన్నారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గంగాపూర్ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీతక్క

గంగాపూర్‌లో వెలిసిన రెండవ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామిని శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెండవ తిరుపతిగా పేరొందిన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో పుణ్యమన్నారు. ఈ సందర్భంగా ఇక్కడున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్, మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, నంబాల మాజీ సర్పంచ్ కొవ్వూరి శ్రీనివాస్, ఎల్ గంటుమేర, మోడెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, నాయకులు దుప్పా నాయక్, ఎల్ గంటుమేర, లావుడ్య పల్లాస్, దాసరి సాంబగౌడ్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు రేపే చివరి గడువు

- బీఎల్‌ఓలు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు అవకాశం
- గతేడాది కంటే 1,899 మంది పెరిగిన కొత్త ఓటర్లు

నవతెలంగాణ-కెరమెరి



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు ఓటు లేని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఓటరు నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 15 చివరి గడువుగా నిర్ణయించింది. అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు మరో రోజు అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి, కొత్తగా ఓటును పొందడానికి ఇదే చివరి అవకాశం. ఇప్పుడు నమోదు చేసుకున్నవారు మే 13న జరిగే లోక్‌సభ పోలింగ్ రోజు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీంతో అధికారులు ఓటు నమోదు, వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతున్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, దాని వినియోగం కూడా అంతే ముఖ్యం. మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం కేవలం ఓటుకు మాత్రమే ఉంది.

ఆన్‌లైన్, బీఎల్‌ఓల ద్వారా..

ఓటు హక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో, బీఎల్‌ఓలు, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లోనూ ధరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు కోసం వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో కూడా వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నది.



స్వీప్‌లో భాగంగా చేపట్టిన ఓటరు అవగాహన 5కె రన్‌లో కలెక్టర్(ఫైల్)

జిల్లాలో పెరిగిన ఓటర్లు

గతేడాది నవంబరు 30న శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా 4,53,538 ఓటర్లు నమోదు చేసుకున్నారు. మళ్లీ ఎన్నికల కమిషన్ కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చింది. అప్పటి నుంచి ధరఖాస్తులు స్వీకరించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న తుది జాబితాను ప్రకటించింది. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య 4,55,438కు చేరింది. అంటే రెండు నెలల వ్యవధిలో జిల్లాలో కొత్తగా 1,899మంది ఓటర్లు పెరిగారు. మే 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మరోసారి నమోదుకు ఈనెల 15 వరకు అవకాశం కల్పించింది. 25న తుది జాబితా ప్రకటించే అవకాశం ఉంది.

జిల్లాలో ఓటర్లు...

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,26,582 ఉండగా, పురుషులు 1,12,510 మంది, మహిళలు 1,14,056 మంది, ట్రాన్స్‌జెండర్లు 16 మంది ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 22,88,55 ఉండగా, పురుషులు114484 మంది, మహిళలు 1,14359 మంది,ట్రాన్స్ జెండర్లు 12మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్లు 2,26,994 మంది, మహిళల ఓట్లు 2,28,415 మంది ఉండగా మొత్తంగా 1421 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు. 2006 మార్చి 31 లోగా పుట్టిన వారంతా త్వరలో జరగబోయే లోక్సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు. వీరంతా ఫారం 6తో పాటు, వయసు ధ్రువీకరణ పత్రం, పాస్ ఫోటో సైజ్ ఫోటో ఆధార్ కార్డును జతపరిచి, సంబంధిత బీఎల్‌ఓలకు అందించాలి. ఫోన్‌లో సైతం సంబంధిత వెబ్ సైట్లను సందర్శించి నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంది.

మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు



సమావేశంలో మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహనీయుల స్ఫూర్తితో మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీమ్‌రావ్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు కోరంగ మాల శ్రీ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద అధ్యక్షతన 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను కుని చేస్తుందన్నారు. ప్రశ్నించే గొంతులను అధికార మదంతో అణిచివేస్తున్నారన్నారు. వికాలంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వాళ్ళను జైల్లో పెట్టారని, కోర్టులు చెప్పిన వదిలిపెట్టడం లేదని ఇది ప్రజాస్వామ్యాన్ని కుని చేయ్యడమే అన్నారు. మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని ఈ ఎన్నికలలో బీజేపీనీ గెలిపేస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కర్ణాటక బీజేపీ నేత ప్రకటించారన్నారు. వీళ్ళు ఇప్పటికే 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కొడ్ చేశారన్నారు. అవినీతి అంతం బీజేపీ నినాదం అని చెప్పి అవినీతిపరులను తమ పార్టీలో చేర్చుకొని నీతిమంతులని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రతిపక్షాలు లేకుండా చేసుకోవడం పనిగా పెట్టుకొని ప్రతిపక్షాలపై ఈడి, సీబీఐ దాడులు చేస్తుందన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, ఆదివాసీ చట్టాలను, ప్రజలకు ఉపయోగపడే అనేక చట్టాలను మార్పు చేసిందని ఆరోపించారు. పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం రాబోయే ఎన్నికల్లో బీజేపీనీ ఓడించాలన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, చాపిడి శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మాడవి గణపతి, జిల్లా కమిటీ సభ్యులు బండి మల్లేష్, చిన్ను పటేల్, కేవీపీఎస్ జిల్లా నాయకులు శ్యామ్, మహేశ పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న నాయకులు

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి భారీ ఎత్తున నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత కొత్త తేడా లేకుండా ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయాలన్నారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసి ఉద్యమం సమయంలో వెళ్ళిన వారే చాలామంది ఉన్నారని బీఆర్ఎస్‌లో ఒంటెద్దు పోకడలు భరించలేక తిరిగి కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. వారందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కాంగ్రెస్‌లో కొన్ని రోజుల క్రితం చేరగా ఆయన వర్గానికి చెందిన వివిధ మండలాల నాయకులు భారీగా పార్టీలో చేరారు. రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వాంకిడి ఎంపీపీ విమల ముండేతో పాటు ఆ మండలానికి చెందిన నాయకులు ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎంపీటీసీ గాధవేని మల్లేష్, మండలంలోని వివిధ గ్రామపంచాయతీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎంపీపీ పెందూర్ మోతీరాం



నవతెలంగాణ-కెరమెరి

సరిహద్దు గ్రామాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పేందూర్ మోతీరాం అన్నారు. శనివారం మండలంలోని మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు గ్రామాలైన లెండికూడా, బోలాపటార్, గౌరీ గ్రామాలను సందర్శించారు. తాగునీటి సమస్యపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. లేండిగూడలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ తాగునీటిని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటి సరఫరాల అవాంతరాలు ఏర్పడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎంపీపీతో పాటు పంచాయతీ కార్యదర్శి మల్లేష్, సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుంరం న్యానేశ్వర్, మాజీ సర్పంచ్ వాగ్మరే శివాజీ, దుందేరావు ఉన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.1.10లక్షలు పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని టోల్ ప్లాజా వద్ద ఉదయం వాహనాలు తనిఖీలు చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్ష పది వేలు నగదును పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని రాజురకి చెందిన గజనంద్ కారులో రాజుర వైపు నుండి మంచిర్యాల వెళ్తుండగా అతని వద్ద నుంచి రూ. లక్ష పది వేలు పట్టుకున్నట్టు తెలిపారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో వాంకిడి ఎస్సై రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి ఇంట్లో..

సమాచారం మేరకు శనివారం ఉదయం మండలంలోని వడ్డీ వ్యాపారుల ఇండ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కిలక డాక్యుమెంట్లు, చెక్కులు, డైరీ, డబ్బులు స్వాధీనం చేసుకొని వడ్డీ వ్యాపారులు తాటిపల్లి రవి, బుట్లె కార్తీక్‌లపై వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై సాగర్ తెలిపారు. తాటిపల్లీ రవి ఇంట్లో రూ. 1,65,000, బుట్లే కార్తీక్ ఇంట్లో రూ.81,100 డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అందరికీ హక్కులను పంచారు

- అటవీ క్షేత్రాధికారి సీహెచ్ పూర్ణచందర్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



డా.బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే సమాజంలో తాను చదువుకొని ఉన్నత ఉద్యోగం చేస్తున్నాను. అట్టడుగు వర్గాల కోసం తన జీవితాన్నే దారపోసి భావితరాల బ్రతుకులను మార్చడానికి ప్రపంచ దేశాల్లో పర్యటించి అతిపెద్ద రాజ్యాంగాన్ని రాసి ఇచ్చారు. ఆయన లేకపోతే ఈ రోజు మనం ఏమైపోయేవారమో తాను దేశానికి రాజ్యాంగం రాశాడు అందరి కోసం పోరాడిన మహా వ్యక్తి. నేటి సమాజంలో అంబేద్కర్ అంటే కేవలం దళితులకు సంబంధించిన వాడనే చెప్పుకోవడం దురదుష్టకరం. అందరి కోసం పోరాడిన మహా వ్యక్తి. అగ్రవర్ణాల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి ఉన్నత చదువులు చదివిన వ్యక్తి. కానీ నేటి యువత అన్ని వసతులున్నా తమ జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారు. నేటి యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయసాధన కోసం భారత రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అందేవిధంగా కృషి చేసినప్పుడే ఆ మహనీయుడికి మనం అర్పించే ఘన నివాళి.

నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం | ఏప్రిల్ 14, 2024 | www.navatelangana.com

బాధితులకు పోలీసుల చేయూత

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని మల్కేపల్లి గ్రామంలో ఇటీవల కుడిమేత రాంచందర్‌కు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామాగ్రితో పాటు పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఎటువంటి ఆధారం లేకుండా తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబానికి మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తమ వంతు సహాయంగా రూ.5000 నగదు ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. ఈ మేరకు సీఐ, ఎస్ఐకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌కు వెళ్తున్న కార్మికునికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ డివిజన్ సింగరేణి సంస్థ నుంచి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఒరిస్సా(పూరి) రాష్ట్రానికి వెళ్తున్న ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరు కొమురయ్యను శ్రీరాంపూర్ ఏరియాలోని 41 బ్యాచ్ బదిలీ వర్కర్లు శనివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాగుల శ్రావణ్ , వెంకటస్వామి, సాయికృష్ణ, మేడి రమేష్, పవన్, రణదీప్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా అడవులను కాపాడుకోవాలి

● అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్



నవతెలంగాణ-జైపూర్

వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడుకోవాలని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్-1 ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధి ముదిగుంట గ్రామ శివారు అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నీలగిరి ప్లాంటేషన్‌లో మంచిర్యాల రేంజ్-2 ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మన్‌తో కలిసి గ్రామస్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో అటవీ ప్రాంతాల మీదుగా వచ్చిపోవు వారు బీడీ, సిగరేట్ తాగి నిర్లక్ష్యంగా పడేయటం ద్వార అడవులు అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. శాఖ పరంగా జాగ్రత్త చర్యలు చేపట్టినప్పటికీ కొందరి నిర్లక్ష్యం కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అడవులు కాలిపోవడం ద్వార పర్యావరణానికి ప్రమాదం కలుగుతుందని, ఫలితంగా మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. అదేవిధంగా అడవుల్లో జీవరాసులకు నష్టం కలుగడమే కాకుండా వాటి బద్రతకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. జీవకోటికి ఆధారమైన అడవులను పరిరక్షించుకోవడం ద్వార పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని సోనాపూర్ తాండ, బంగారు తండా గ్రామాలకు చెందిన, బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు, శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ ఖాన్ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు నేరుగా చేరుతున్నాయన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అందుకు, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారు బంగారు తండాకు చెందిన లకావత్ తిరుపతి, బోడ నిమ్మ నాయక్, లకావత్ బిల్య నాయక్, బోడా జయరామ్, లాకవత్ రవి, సక్కరెడ్డి శంకర్, విజేందర్, రవి, బాలాజీ. రవీందర్, కేసేయరాజేష్, బాబులల్, కొమ్రు, బన్సిలల్, లాకవత్ శంకర్ పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బోడ రవి నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జరుపుల ధర్మ నాయక్ పాల్గొన్నారు.

15న మందమర్రిలో బీసీ ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభ



నవతెలంగాణ-మందమర్రి

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సాగుతున్న బీసీ ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభ ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు మందమర్రి మార్కెట్‌లో నిర్వహిస్తున్నట్లు బీసీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాజేశం తెలిపారు. శనివారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో బీసీ ఐక్య వేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీసీ కులాల జనగణన చేపట్టాలన్నారు. బీసీ రిజర్వేషన్లు జనభా అనుగుణంగా పెంచాలని, చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేది సోమవారం సా 5 గంటలకు మార్కెట్‌లో బీసీ చైతన్య యాత్ర ముగింపు సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొఫెసర్ మురళి మనోహర్, కులాల తత్వవేత్త, పేరం అలేఖ్య న్యాయవాది పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. బీసీ నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనుకూట్ల మల్లయ్య బీసీ ఐక్య వేదిక సీనియర్ నాయకులు, కొండయ్య, పోలు శ్రీనివాస్, ముత్తయ్య, జమాల్పురి నర్సోజీ పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని కావడం ఖాయం

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణక్క గెలిస్తేనే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆత్రం సుగుణక్కకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను, ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాహుల్‌ని ప్రధాని చేయడానికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసియుల్లా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రజాక్, నందు నాయక్, అరె శిరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడితేనే నిజమైన నివాళి

నవతెలంగాణ-నస్పూర్



శ్రమ దోపిడికి గురవుతున్న కార్మికుల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలను నిర్మించి, పోరాడితేనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌పీ ఓసీపీ, బంగ్లాస్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఎస్సీకేఎస్(సీఐటీయూ) ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ భారతదేశానికి సరికొత్త స్వేచ్ఛను, హక్కులను అందివ్వడానికి అంబేద్కర్ చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, కార్మిక, కర్షక అన్ని తరగతుల ప్రజలను వారి బతుకులు మార్చడానికి రాజ్యాంగ నిర్మాణం చేసిన గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నేటి పాలకులు ప్రజల ఐక్యతను దెబ్బ తీయడానికి ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెడుతూ, మతోన్మాదాన్ని ముందుకు తెస్తూ రాజ్యాంగ ఫలాలను నిమ్నజాతి ప్రజలకు అందకుండా రాజ్యాంగానికి పూర్వం ఉన్న మనుస్మృతి లోకి నెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా కార్మిక వర్గానికి వెన్నుముకైన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, వాటి స్థానంలో కార్పొరేట్ అనుకూల 4 లెబర్ కోడ్‌లను తీసుకురావడం, వాటితో కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు కట్టు బానిసలు చేయాలని తీవ్రమైన ప్రయత్నాలతో ఈ రోజు మోడీ ప్రభుత్వం ముందుకు వస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై చేసే దాడికి వ్యతిరేకంగా, రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా అలాగే రాజ్యాంగాన్ని రక్షించడానికి కార్మిక వర్గం క్రియాశీలక పాత్ర పోషించి కార్మికులంతా ఐక్యమై, ఐక్య పోరాటాలతో మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే అంబేద్కర్‌కు కార్మిక వర్గం ఇచ్చే నిజమైన ఘన నివాళని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రమేష్, తిరుపతి, బండ రాజేందర్, కోమల, లక్ష్మి, అశోక్, ప్రభాకర్, పుశ్ప, రవిందర్, ప్రశాంత్, సమ్మన్న, సాగర్, శ్రీనివాస్, మొగిలి, కిరణ్, రాము, రాజయ్య, సాయికిరణ్, నాగరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసిన వారవుతారు

● ఎస్టీపీపీ చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం ఎన్ జైన్‌సింగ్



నవతెలంగాణ-జైపూర్

రక్తదానం చేయడం ద్వార ఇతరుల ప్రాణాలను కాపాడిన వారమవుతామని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం ఎస్ జైన్ సింగ్ అన్నారు. భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం విద్యుత్ ప్లాంట్ లోగల బ్యాచిలర్ ట్రైనీ హాస్టల్‌లో రక్త దాన శిభిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా డీజీఎం పంతులా నాయక్, డీవైఎస్ఈ భీమాతో కలిసి రక్తదానం చేశారు. అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతుండగా రక్తదాన శిభిరం ద్వార 121 యూనిట్ల రక్తం ప్లాంట్ ఉద్యోగుల ద్వార సేకరించినట్లు కార్యక్రమ నిర్వాహకులు పంతులా నాయక్ తెలిపారు. రక్తదాన శిభిరంలో ఎస్టీపీపీ సింగరేణి అధికారులు, ఉద్యోగులు, పవర్‌మేక్, పీఈఎస్ కంపెనీ అధికారులు, ఉద్యోగులు, ప్లాంట్ పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్త దాన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (సివిల్) కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, డీజీఎం వేణుగోపాల్ రావు, ఎస్ఈ అప్పారావు, డీజీఎం వాటర్ సిస్టమ్ జనగామ శ్రీనివాస్, డీజీఎం సీహెచ్‌పీ వివి సుధాకర్ రెడ్డి, డీజీఎం ఎఫిషియన్సీ పీవీ బ్రహ్మం, ఎస్టీపీపీ సీఎంఓఏఐ అధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఓ టు జీఎం వెంకటయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, పర్సనల్ మేనేజర్ లొల్ల రామశాస్త్రీ పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

అంబేద్కర్ జయంతి సందర్భంగా జైపూర్ ఎస్టీపీపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు విద్యుత్ ప్లాంట్ డీజీఎం పంతులా నాయక్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఎస్టీపీపీ ఓపన్ ఆడిటోరియం నుండి పెగడపల్లిలో గల అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, తదుపరి అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఓపన్ ఆడిటోరియం వద్ద పతాకావిష్కరణ, ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొంటూ పండుగ వాతావరణలో జరుపుకుంటున్న బీఆర్ అంబేద్కర్ జన్మదిన కార్యక్రమాలలో అందరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



పరిమితికి మించి వైద్య సేవలు అందించకూడదు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జీసీ సుబ్బారాయుడు



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని గ్రామీణ వైద్యులు (ఆర్ఎంపీ, పీఎంపీ) తమ పరిమితికి మించి వైద్య సేవలు అందించకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జీసీ సుబ్బారాయుడు అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, గ్రామీణ వైద్యులు అందించవలసిన సేవలపై జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు వైద్యం అందిస్తున్న కేంద్రంపై ప్రథమ చికిత్స కేంద్రం అని ఉండాలని, ఈ ప్రథమ చికిత్స కేంద్రంలో పడకలు ఉండకూడదని, ఎలాంటి నమూనా మందులు ఉండకూడదని, ఎలాంటి యాంటిబయాటిక్స్ వినియోగించకూడదని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత కారణంగా వడదెబ్బకు గురైన బాధితులకు ప్రథమ చికిత్స అందించి సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలు, వడదెబ్బ బాధితులు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అత్యవసర సేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లను వినియోగించి ప్రభుత్వ ఆస్పత్రులకు మాత్రమే తరలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. వైద్యులు నిబంధనలు ఉల్లంఘించినట్లయితే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివప్రతాప్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంక్షేమ సంఘం, అనుభవ వైద్య సంఘం ప్రతినిధులు, జిల్లాలోని 18 మండలాల నుండి మారుమూల ప్రాంతాలలో పని చేస్తున్న 285 మంది గ్రామీణ వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలి



నవతెలంగాణ-మందమర్రి

క్షేత్ర స్థాయి పర్యటనలో సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలని ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ రాజేశ్వర్ ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ దేవేందర్‌ల అధ్యక్షతన డీఆర్‌పీ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు కో-ఆర్డినేషన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 14వ సామాజిక తనిఖీ నిమిత్తము సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనలో సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలని ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కో-ఆర్డినేషన్ సమీక్షా సమావేశంలో అడిషనల్ ప్రోగ్రామ్ అధికారి రజియా, సామాజిక తనిఖీ బృందానికి సంబంధించి ఎస్‌టీఎం, డీఆర్‌పీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరుగుతోంది

● సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో రాజకీయ జోక్యం మరింత పెరుగుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ అనుబంధ యూనియన్ మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అడుగులకు మడుగులు ఒత్తుతుందని ఆరోపించారు. గుర్తింపు ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. గత గుర్తింపు సంఘంలో ఉన్న నాయకులు పైరవీలతో సర్ఫేస్లో కొనసాగే వారని, ప్రస్తుత ప్రభుత్వ అనుబంధ యూనియన్ ఐఎన్టీయూసీలో అదే పద్ధతి కొనసాగుతుందని, ఇలా చేయడం వలన అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న సీనియర్ కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే సింగరేణిలో ఎన్నికల కోడ్ పేరుతో ప్రమోషన్లను ఆపడం సరికాదన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో దాదాపు 150 పైగా అక్రమ డిప్యూటేషన్లు జరిగాయని అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం కొనసాగితే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నెల 11వ తేదీన కొత్తగూడెంలో జరిగిన సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులకు సబంధించి పలు విషయాలు అంగీకారం జరిగాయని అందులో రిటైర్డు అయినా రోజునే ఉద్యోగికి మెడికల్ కార్డ్ అందజేత, దీర్ఘకాలిక వ్యాధులకు అయ్యే మొత్తం ఖర్చు ట్రస్ట్ భరించాలని, ఇప్పటివరకు మెడికల్ కార్డులో దీర్ఘకాలిక వ్యాధులకు ఖర్చు అయితే వాటిని తిరిగి ఇప్పించడానికి అంగీకారం చేశామన్నారు. అలాగే సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేసి అందులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి ఉప కార్యదర్శి కొమురయ్య, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సారయ్య, మురళి చౌదరి, లక్ష్మణ్, సత్తయ్య, మల్లికార్జున్, నర్సింగ రావు, సురేష్, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆర్కే-8 డిస్పెన్సరీలో సింగరేణి కార్మికులు శనివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డీజీఎం చిరంజీవులు, ఎస్సీ లైజెన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ లైజెన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో బడుగు, బలహీన, హరిజన, గిరిజన, మహిళా వర్గాలకు సమమోదా కలిగించడం కోసం అనేక ప్రత్యేక సూచనలు చేశారని, వీటిని అమలు జరుపుతున్న ప్రభుత్వ సంస్థల్లో సింగరేణి కాలరీస్ సంస్థ దేశంలోనే అగ్రగామిగా ఉంటోందని పేర్కొన్నారు. దేశంలో ఏ ఇతర బొగ్గు పరిశ్రమల్లో లేని విధంగా సింగరేణి సంస్థలో అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీని సెలవు దినంగా ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఏరియాకు రూ.లక్ష కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్, రాజేష్, రాజు నాయక్, లక్ష్మణ్, విక్కీ, కమల్, రాజ్ కుమార్, మురళి, సుమన్ పాల్గొన్నారు.

పంట పొలాలను ధ్వంసం చేస్తున్న పందులు



నవతెలంగాణ-జైపూర్

చేతికి అందివస్తున్న వరి పంట పొలాలను పందులు ధ్వంసం చేస్తున్నాయని భీమారం శివారు రైతులు వాపోతున్నారు. రాత్రి పూట అడవి పందులు, పగటి పూట ఊర పందులు పంట పొలాల్లో స్వైరవిహారం చేస్తున్నాయని శివారు రైతులు కోట పెద్ద రాజం, రాజేశ్వరి, అనపర్తి దేవదాస్, సమ్మయ్య, రాజారాం ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో వచ్చి చేరుతున్న పందులు వరి పైరును ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. వరి పంట పొలాలతో పాటు నిలువెత్తు పెరిగిన మక్క తోటలను పందులు పూర్తిగా ధ్వంసం చేసినట్లు బాధిత రైతు అనపర్తి దేవదాస్ తెలిపారు. అడవి పందుల కోసం రాత్రి పూట, ఊర పందుల కోసం పగటి పూట రాత్రింబవళ్లు కాపలా కాసిన పంటలను కాపాడుకోలేని పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. రాత్రి పూట వచ్చే అడవి పందులను టపాసులు పేల్చి చెదరగొట్టినా పగటి పూట వచ్చే ఊర పందులను ఎన్నిమార్లు చెదరగొట్టినా చూసిచూడకుండా మళ్లీమళ్లీ వస్తున్న పంట పొలాలను కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారిందని వాపోతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఏప్రిల్ 14, 2024 | www.navatelangana.com

ఏకాదశ దివస దీక్షలు స్వీకరించిన భక్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం 400 మందికి పైగా భక్తులు ఏకకాలంలో ఏకాదశ దివస దీక్షలు స్వీకరించారు. పెద్ద మొత్తంలో భక్తులు దీక్షలు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఉదయం నుండి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ, మహేశ్వర శర్మ, విజయ్ కుమార్ శర్మ చంద్రశేఖర శర్మలు పూజలు సహస్ర తమల పత్రార్చన అష్టోత్తర పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు రాధాకృష్ణ చారి, ప్రకాష్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యం

నవతెలంగాణ-సారంగాపూర్



మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యమని డబ్ల్యుపీసీ రమాదేవి, రాధికలు అన్నారు. శనివారం మండలంలోని చించోలి(బి) గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ఈవ్ టీజింగ్‌కు గురైతే షీటీమ్ వెంటనే స్పందిస్తుందని, ప్రతీ మహిళా, విద్యార్థినులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తే తక్షణమే 1930 లేదా డయల్ 100కి షీటీమ్ నెంబరు 8712659556కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూధన్, ఉపాధ్యాయులు రమేష్, సాయన్న, సునీత, షీటీమ్ సిబ్బంది రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం : వెంకట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తూనే ఉంటుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తూనే ఉందని అన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ మూల సూత్రాలుగా పనిచేస్తున్న టీఎస్‌యూటీఎఫ్, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే క్రమంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఓవైపు ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్మిస్తూనే, మరోవైపు ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు కార్యక్రమాలను రూపొందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమాంలో జిల్లా అధ్యక్షులు ఎం.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేఖ, కార్యదర్శి కె.శ్రీనివాస్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



నవతెలంగాణ-సారంగాపూర్

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలూరు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామ శివారులో శనివారం రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దండ్ల దయాకర్(21) మృతి చెందాడు. నిర్మల్‌లోని వైఎస్ఆర్ కాలనీ నుంచి ఆలూరు గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం ట్రాక్టర్‌లో బండ రాళ్లను తీసుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఆలూరు గ్రామ శివారులో ట్రాక్టర్ ముందు టైర్ పగిలి అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. డ్రైవర్ అపస్మారక స్థితిలో పడిపోయాడు స్థానికులు 108 సమాచారం ఇచ్చారు. వెంటనే వాహనంలో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న మరో ఇద్దరు దూకి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ప్రత్యేక పూజలు శనివారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గంద్రత్ రమేష్ మండలంలోని అంకాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జగదీష్ యాదవ్, రమణ, గంగయ్య యాదవ్, లక్ష్మణ్, మల్లేష్, కుమ్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలో 11 కెవి పీఎంఐ ప్రీ మాన్సూన్ తనిఖీ కార్యక్రమం కారణంగా విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉండనున్నట్లు పట్టణ ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్, బజార్‌వాడి, పైకాజ్ నగర్ ప్రధాన రహదారి తో పాటు, కుమురం భీం చౌక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తా..

నవతెలంగాణ-పెద్దపల్లి

స్థానికుడినైన నా గెలుపుకు ప్రజలు సహకరించాలని, పెద్దపల్లి పార్ల మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రొఫెసర్ డాక్టర్ నతానియేలు కోరారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు. ఇప్పటివరకు స్థానికేతరులు పెద్దపల్లి ఎంపీలుగా గెలిచారని, నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో అవగాహన, పట్టు లేకపోవడంతో అభివృద్ధి జరగలేదన్నారు. పాలిటెక్నిక్, మైనింగ్, పీజీ కళాశాలలు, విశ్వ విద్యాలయం లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కర్రె మహేందర్ రెడ్డి, జంగ మహేందర్ రెడ్డి, పల్లెల వీరస్వామి, దొడ్డె బాపు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ ధ్యేయం

- సంఘం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ ధ్యేయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. సంఘం 11వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తే వెంటనే వాటిని ఖండిస్తూ సమస్యల పరిష్కారంలో సంఘం అగ్రగామిగా నిలుస్తోందని అన్నారు. ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత ఇస్తూ, కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని అలుపెరుగని పోరాటాలు చేసే సంఘం టీఎస్‌యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. సంఘం జిల్లా గురుకులాల కో కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ కరోనా సమయంలో మరియు వరద బాధితులకు సహాయం అందించి సామాజిక స్పృహ కలిగిన సంఘంగా టీఎస్‌యూటీఎఫ్ నిలిచిందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి విరాళాల సేకరణ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు మహిపాల్ మాట్లాడుతూ



లక్షెట్టిపేట్‌లో జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



కాగజ్‌నగర్‌లో జెండావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రభుత్వాలు ఎన్ని మారినా టీఎస్‌యూటీఎఫ్ ఎప్పుడు కూడా ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పుల్లూరు బాలు, సభ్యులు సుందిళ్ల రమేష్, నయీమ్, సుచరిత, మానస, సాయి కృష్ణ, మంజుల పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : ప్రభుత్వ ఉపాధ్యాయులు ఐక్యమత్యంతో పనిచేయాలని టీఎస్‌యూటీఎస్ జిల్లా కార్యదర్శి చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ అభివృద్ధికి నిరంతరం ఉద్యోగ సంఘం కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చి క్రియాశీలక పాత్ర పోషించి ముందుకు సాగుతుందని అన్నారు. నిరంతరం ఉపాధ్యాయ సమస్యల పట్ల స్పందిస్తూ విద్యార్థులకు చక్కని విలువలతో కూడిన బోధనకు ప్రాధాన్యత ఇచ్చే సంఘములో సభ్యులుగా ఉన్నందుకు గర్వపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గొర్రె నరసయ్య, లక్షట్టిపేట మండెల అధ్యక్షుడు బండ శ్రీనివాస్, కోశాధికారి రాజలింగం, సీనియర్ నాయకుడు దిలీప్, దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఇండ్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు శనిగారపు సతీష్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల ఉక్కు పాదం

- ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా దాడులు
- జిల్లా కేంద్రంలో ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం చిట్టిల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏడు బృందాలతో పోలీసులు శనివారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్ నగర్ కేంద్రాల్లో ఇతర మండలాల్లో కూడా దాడులు నిర్వహించారు. దాడుల్లో పెద్ద ఎత్తున పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎక్కువగా ఆదివాసులు ఉండడం వారి నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని అనేక మంది వారికి అత్యధిక వడ్డీరేట్లకు డబ్బులు ఇస్తున్నారని ఫిర్యాదులతో దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించకూడదని అది చట్టరీత్యా నేరమని రానున్న రోజుల్లో మరిన్ని దాడులు జరగనున్నట్లు పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

జిల్లా కేంద్రంలో ఇద్దరుపై కేసు నమోదు

శనివారం నిర్వహించిన దాడుల్లో జిల్లా కేంద్రంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇండ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన తపాసే శ్రీనివాస్, తనకు దత్తాత్రిపై 420 కేసుతో పాటు తెలంగాణ మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సిఐ సతీష్ తెలిపారు. ఈ ఇద్దరు వ్యక్తుల నుండి 61 ప్రామిసరీ నోట్లు, 32 వివిధ బ్యాంకుల బ్లాంక్ చెక్కులు, 22 అప్పు ఒప్పంద బాండ్ పేపర్లు సీజ్ చేయడం జరిగినదని,



ఆసిఫాబాద్‌లో వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు



కాగజ్‌నగర్‌లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

తనకు దత్తాత్రి వద్ద వడ్డీ వ్యాపారం కోసం దాచిన నగదు రూ. 14,79,070 కూడా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ కాగజ్ నగర్ డిఎస్పీలు సదయ్య, కరుణాకర్, ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.


కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలో అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ పేదల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న వ్యాపారస్తుల ఇళ్లు, కార్యాలయాలలో శనివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆర్ ప్రభాకర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. స్థానిక ఓల్డ్ కాలనీకి చెందిన సాబీర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ. 3.01 లక్షలతో పాటు ప్రామీసరీ నోట్లు, నాన్ జ్యూడిషియల్ బాండ్లు, బ్లాంక్ చెక్‌లు లభ్యమయ్యాయి. స్థానిక త్రైబనగర్‌కు చెందిన చిదిరాల రాజశేఖర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ. 3.78 లక్షలు, స్థానిక మార్కెట్ ఏరియాలోని సంతోష్ ఇంట్లో సంతకం లేని మరియు ఉన్న చెక్‌లు, నాన్ జ్యూడిషియల్ బాండ్స్, బ్యాంక్ పాస్‌బుక్స్, ప్రామిసరీ నోట్స్, ఏటీఎం కార్డులు, బంగారం, సెల్‌ఫోన్స్, రిజిష్టర్లు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఆర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అమాయక ప్రజలకు అప్పులు ఇస్తూ వారి నుండి అధికంగా వడ్డీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మేరకు ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. సోదాలు నిర్వహించిన వారిలో టౌన్, రూరల్ సీఐలు శంకరయ్య, అల్లం రాంబాబుతో పాటు డివిజన్‌లోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి
- మంత్రి సీతక్కకు వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకుడు కృష్ణమాచారి కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు పశుమిత్రలు, ఇండియన్ కార్మికులు, ఐకెపి వివోఏలతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమ ముఖ్యమైందని, దాని బాగోగులు చూసే పశుమిత్రల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలిపారు. వారిని వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీతో ఇవ్వాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఐకేపీ వీఓఏల యూనియన్ జిల్లా నాయకురాలు ఫహిమా మాట్లాడుతూ వీఓఏలను ఎస్ఈఆర్‌పి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న పశుమిత్రులు

ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుమిత్రల అధ్యక్ష కార్యదర్శులు వనితా, శ్రీలత, జిల్లా నాయకులు పుష్ప, మారుబాయి పాల్గొన్నారు.

పర్యవేక్షకులు సహకరించాలి

- రామగుండం నగర కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్

నవతెలంగాణ-గోదావరిఖని

నగరాన్ని సమస్యారహితంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు సహకరించాలని రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ సి హెచ్ శ్రీకాంత్ కోరారు. శనివా రం ఉదయం పారిశుద్ధ్య పర్యవేక్షకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతంగా పారిశుద్ధ్య నిర్వహణ చేయడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం అమలు, కుక్కల బెడద ,నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీలు, వీధి దీపాలు, అక్రమ నిర్మాణాలు తదితర సమస్యలు డివిజన్‌లో గుర్తించి సంబంధిత అధికారులు దష్టికి తీసుకువచ్చి పరిష్కరింపజేయడంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ త్రియంబకేశ్వర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ రావు,పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఉద్యమ సంఘీభావ నిధి సేకరణ

నవతెలంగాణ-గోదావరిఖని

ఐటీసీ, హెచ్‌పిసిఎల్ కార్మికుల నుండి సామాజిక న్యాయ ఉద్యమ సంఘీభావ నిధి సేకరణ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బిటి రణదీవే వర్ధంతి అయిన ఏప్రిల్ 6 నుండి భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వారోత్సవాలలో భాగంగా సామాజిక సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, గిరిజన సంఘాలకు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా సామాజిక న్యాయ ఉద్యమ సంఘీభావ నిధిని శనివారం కుందనపల్లిలో గల ఐటీసీ, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్ల నుండి స్వచ్ఛందంగా నిధి 1840 రూపాయలను సేకరించారు. సేకరించిన ఈ నిధిని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ద్వారా ఆయా సంఘాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలు ఆచరణకు నోచుకోవడం లేదు

- నేతకాని మహార్ సంఘం అధ్యక్షులు పొట్టాల నాగరాజు

నవతెలంగాణ-జైపూర్



ప్రపంచ మేధావి, పరమపూజ్యుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత దేశానికి దిశా నిర్దేశం చేసిన ఆయన భారత దేశంలో పుట్టడం దేశానికి గర్వకారణం. అలాంటి మహానుభావుడు పుట్టిన దేశంలో మనమందరం పుట్టినందుకు గర్వపడాలి. తనకు తానుగా సర్వం కోల్పోతూ భారత దేశ ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని ఆశించిన సమతామూర్తి బీఆర్ అంబేద్కర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వార జీవ కోటికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతుత్వం ప్రసాదించిన మహానుభావుడు. సమాజంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించి లింగ బేధం లేకుండా అందరికి సమాన హక్కులను కల్పించడం, ప్రత్యేకంగా స్త్రీ ఉద్ధారణ కోసం అనే పోరాటాలు చేసి హిందూ కోడ్‌బిల్ రూపొందించి వారికి బాసటగా నిలిచాడు. ఈ క్రమంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి పదవిని సైతం లెక్క చేయని మొట్టమొదటి వ్యక్తి. భారత దేశంలో జీవిస్తున్న 18 సంవత్సరాల వయస్సు గల వారందరికి ఓటు హక్కు అందించి ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కల్పించారు. రాజకీయాలకు పేదరికం, కులం అడ్డుకాదని తలచి ఓటు హక్కు ద్వార అందరి తల రాతలు మార్చుకునే అవకాశం కల్పించారు. నేటి సమాజం డాక్టర్ అంబేద్కర్ ఆలోచన, ఆశయాలకు విరుద్ధంగా కొనసాగుతుంది. ఆయన ఆశయాలు ఆచరణకు నోచుకోవడం లేదు. కులాలు, మతాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు కోపతాపాలు పెంచుకొని ఎవరికి వారు దూరమవుతున్న తీరు బాధాకరం. బడుగు బలహీణ వర్గాల కుటుంబాలు తమ పిల్లలకు మహానీయుల చరిత్రలు, డాక్టకర్ బాబాసాహెబ్ అంబేద్కర్ త్యాగాలను తెలుపుతూ ఆయన రచించిన పుస్తకాలను చదివించి సమాజానికి ఉపయోగపడేలా కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలి.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- మున్సిపల్ కమిషనర్ సతీష్

నవతెలంగాణ-నస్పూర్



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని, దేశ ఉన్నతికి, వికాసానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. శనివారం నవ తెలంగాణ పత్రికతో మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని, ఏ ఒక్క జాతికో, వర్గానికో, కులానికో పరిమితమైన వాడు కాదని ఈ దేశంలో అన్ని వర్గాల మతాలు, కులాలు గురించి ఆలోచించి భారత రాజ్యాంగం ద్వారా నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనికుడని తెలిపారు. దేశజనుల హితం కోసం తన జీవితాన్ని ధారబోసాడని పేర్కొన్నారు. కుల వివక్షతకు తావు లేకుండా అత్యున్నత విలువలతో కూడిన లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు బాబాసాహెబ్ అనుసరించిన ఆశయాలు, కార్యచరణ మహోన్నతమైనవని కొనియాడారు. దేశంలోని ప్రజలందరికీ ఓటు హక్కును కల్పించి అందరికీ సమాన హక్కును కల్పించారన్నారు. నేడు అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని వారికి నివాళులర్పించారు.

అణగారిన కులాల ఆత్మ గౌరవ చిహ్నాం

- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఇరిగిరాల మల్లేష్

నవతెలంగాణ-జైపూర్



భారతదేశంలో కంటే ప్రపంచంలో అంబేద్కర్ సిద్ధాంతాల పట్ల విధాన నిర్ణాయక సంస్థల్లో, వ్యక్తుల్లో ఆసక్తి, అధ్యయనం, ఆమోదం, అనుసరణ పెరిగిందని మేధావి వర్గం గుర్తించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి అంబ్కేదర్‌ను ప్రపంచంలోని అణగారిన కులాల ఆత్మ గౌరవ చిహ్నంగా ప్రకటించింది. భారతదేశ ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని వేదికలపై ఉపన్యాసాలు ఇవ్వడమే కాని ఆచరణలో కన్పించకపోవడం లేదు. భారత దేశం అనే భావనకు రూపకల్పన చేసింది అంబేద్కర్, సామాజ శ్రేయస్సు కోరి బడుగు బలహీణ వర్గాల అభ్యున్నతి కోసం మొదటి నుండి చివరి వరకు కృషి చేసిన ఆయనకు ఈ సమాజం రుణపడివుంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా పరిపాలన వ్యవస్థకు ప్రాతిపాధికగా పటిష్టమైన రాజ్యాంగ వ్యవస్థను దానిని అమలు చేసే వ్యవస్థలను ప్రతిపాదించారు. అంబేద్కర్ ఏ ఒక్కరికో స్వంత కాదు.. అందరి వాడు.. ఆయన ఆశయాలను అనునిత్యం నెమరు వేసుకుంటూ ఆయన విగ్రహాలను ఊరు వాడ అనే తేడా లేకుండా నెలకొల్పాలి. అంబేద్కర్ జయంతి మనమంతా కలిసి చేసుకోవాలి. ఆయన చూపిన బాటలో మనుగడ కొనసాగించినప్పుడే ఆయనకు ఆయన ఆశయం నెరవేరుతుంది.

ఆదర్శమూర్తి అంబేద్కర్

- అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి చిప్పకుర్తి వెంకటేశ్

నవతెలంగాణ-జైపూర్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరికి ఆదర్శమూర్తి చిన్నతం నుండి అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ సమాజమార్పు కోసం పరితపించి ఆయన రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచింది. 19వ శతాబ్ది తుది దశకంలో ప్రతిభావంతుడుగా భారతదేశ ముద్దుబిడ్డగా జన్మించిన అంబేద్కర్ అనేక అవమానాలతో పెరిగి ప్రపంచ ప్రఖ్యాతుడుగా అవతరించాడు. హిందూ సమాజాన్ని పునర్నిర్మించాలని, హిందూ మత ధర్మ శాస్త్రాన్ని మౌళికంగా సంస్కరించాలని ఫలితంగా సమస్త హిందువులకు సమాన హక్కులు కల్పించాలని అంబేద్కర్ ప్రగాడంగా కోరుకున్న వ్యక్తి. బాబాసాహెబ్ అంబేద్కర్ హిందు మత దురాచారాల పీడితులైన దళితులు, ఇతర అణగారిన వర్గాల వారి నాయకుడు మాత్రమే కాదు. సకల భారతీయుల మహోన్నత నాయకుడు, నిజమైన జాతీయవాది, నికార్సయిన దేశభక్తుడు. నిరుపమానమైన వ్యక్తిత్వం కలిగిన అంబేద్కర్ భారతమాత ముద్దుబిడ్డగా జన్మించడం దేశానికి గర్వకారణం. మహోన్నతుడైన అంబేద్కర్ చూపిన బాటలో నడుచుకోవడం, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరం బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

వాటికి సమాధానమే గీతాంజలి 3

అంజలి 50వ సినిమా 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవివి సినిమాస్‌తో కలిసి కోన ఫిల్మ్ కార్పొరేషన్‌పై కోన వెంకట్ నిర్మించారు. హర్రర్ కామెడీ జోనర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ఈనెల 11న విడుదల చేశారు. సినిమాకు వస్తున్న స్పందన గురించి గీతాంజలి 3 గురించి దర్శకుడు శివ తుర్లపాటి మీడియాతో మాట్లాడారు. 'మా సినిమాకి రెస్పాన్స్ చాలా బావుంది. రివ్యూలను కూడా చూశాను. రివ్యూల్లో చెప్పే విషయాలను నేనెప్పుడూ పాజిటివ్‌గా తీసుకుంటాను. సినిమాలో చాలా వాటికి ఆన్సర్ చేయకుండా వదిలేశారని కొందరు రాశారు. అయితే, ఆ లాజిక్కుల న్నింటికీ సమాధానం చెబుతూ పోతే, మూడు గంటల నిడివి వస్తుంది. అని అన్నారు.

మహిళలు కనెక్ట్ అవుతారు

సత్యం రాజేష్ హీరోగా నటిస్తున్న ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్ 'టెనెంట్'. వై.యుగంధర్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్ పై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రవీందర్ రెడ్డి.ఎన్ సహ నిర్మాత. ఈనెల 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్‌గా రిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న హీరో ప్రియదర్శి మాట్లాడుతూ,'నటుడిగా రాజేష్ ప్రయాణం, ట్రాన్స్‌ఫర్మేషన్ స్ఫూర్తిదాయకం. ముందు రిలీజ్ చేసిన ట్రైలర్‌తో పాటు ఇప్పుడు రిలీజ్ చేసిన ట్రైలర్ బాగా నచ్చింది. నిర్మాతల కళ్ళలో ఆనందం చూస్తుంటే సినిమా ఎంత అద్భుతంగా వచ్చిందో తెలుస్తోంది. కంటెంట్ చాలా కొత్తగా ఉంది' అని తెలిపారు. 'దర్శకుడు యుగంధర్ ఈ కథని ఎంత అద్భుతంగా చెప్పారో అంతే అద్భుతంగా సినిమాని తీశారు. డబ్బింగ్ చెబుతున్నప్పుడు క్లైమాక్స్‌లో కన్నీళ్లు వచ్చేశాయి. నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమాని చాలా ప్రేమించి చేశారు' అని హీరో సత్యం రాజేష్ చెప్పారు. దర్శకుడు వై.యుగంధర్ మాట్లాడుతూ, 'ప్రతి ఇంట్లో మహిళలకు కనెక్ట్ అయ్యే కథ ఇది.

మేకప్ మ్యాన్ షూటింగ్ షురూ..

అభిరామ్ మూవీస్ బ్యానర్ పై సీనియర్ మేకప్ మ్యాన్ కుమార్ మెట్టుపల్లి నిర్మాతగా, దివాకర్ యఢ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'మేకప్ మ్యాన్'. నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. పోలూరు ఘటిక చలం డైలాగ్స్, ఎం ఎం శ్రీలేఖ సంగీతం అందిస్తున్నారు. శనివారం ఈ చిత్ర ప్రారంభోత్సవం ఫిల్మ్ ఛాంబర్‌లో గ్రాండ్‌గా జరిగింది. దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ కవుటూరి మాట్లాడుతూ,'నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. చిన్నప్పట్నుంచీ మామయ్యను చూసి పెరగడంతో సినిమాలపై ఆసక్తి కలిగింది. ఇలాంటి మంచి కాన్సెప్ట్‌తో హీరోగా పరిచయం అవడం చాలా ఆనందంగా ఉంది. ఇది అందరికీ కచ్చితంగా అలరిస్తుంది' అని అన్నారు.

'చిత్ర పరిశ్రమలో మేకప్ మ్యాన్ ప్రాముఖ్యత చాలా కీలకంగా ఉంటుంది. అలాంటి మేకప్ మ్యాన్‌ల జీవితాలను ఇందులో చూపిస్తాము. వాళ్ళ లైఫ్ స్టైల్, వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలను ఇందులో చూపించ బోతున్నాం. త్వరలో షూటింగ్ మొదలు పెడుతున్నాం' అని చిత్ర దర్శకుడు దివాకర్ యఢ్ల చెప్పారు.

నిర్మాత కుమార్ మెట్టుపల్లి మాట్లాడుతూ,'సినిమా నిర్మించాలని ఎప్పటినుంచో ప్లాన్ చేస్తున్నా. ఇన్నాళ్లకు మంచి కథతో ప్రొడక్షన్ స్టార్ట్ చేయడం హ్యాపీగా ఉంది' అని తెలిపారు.

సీనియర్ రచయిత ఘటిక చలం, నటులు కట్టా రంజిత్ ఆనంద్ భారతి చిట్టిబాబు, రచయిత నాగరాజు చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు.

కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్టర్ : దివాకర్ యఢ్ల, డైలాగ్స్ : ఘటక చలం, డీఓపి, ఎడిటర్ : వాసు వర్మ, సంగీతం : ఎం ఎం శ్రీలేఖ, రచనా సహకారం : శ్రీను గ్రంధి.



శ్రీకాంత్ అవుటూరి, రవికుమార్ చౌదరి







డోపింగ్‌లో దొరికిన స్టార్ అథ్లెట్

భారత్‌లో కొనసాగుతున్న డోపింగ్ కలకలం

న్యూఢిల్లీ : ఇటీవల వాడా విడుదల చేసిన నివేదికతో భారత క్రీడా రంగం ప్రతికూల ప్రభావానికి గురైంది. అంతర్జాతీయ క్రీడా సమాజం దృష్టిలో భారత్‌లో అత్యధిక డోపింగ్ కేసులు వస్తున్నాయనే ప్రచారం జరిగింది. ఇది అథ్లెట్లను కలవరపాటుకు గురి చేస్తుండగా.. మరోవైపు డోపింగ్ పాజిటివ్ కేసులు కొత్తగా వస్తున్నాయి!. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన ఓ స్టార్ మహిళా అథ్లెట్ తాజాగా డోపింగ్‌లో దొరికిపోయింది. ఫిబ్రవరి 16న సేకరించిన శాంపిల్స్‌లో మహిళా అథ్లెట్ నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్టు తేలింది. శాంపిల్ పాజిటివ్‌గా తేలినా.. అథ్లెట్‌పై ఎటువంటి సస్పెన్షన్ విధించలేదు. రానున్న టోర్నమెంట్లలో పోటీపడేందుకు ఎటువంటి నిషేధం విధించలేదు. సంతాన సాఫల్యత కోసం సదరు మహిళా అథ్లెట్ వైద్య చికిత్స తీసుకోగా.. ఆమె శాంపిల్స్‌లో క్లోమిఫెనె ఉన్నట్టు వెల్లడైంది. వాడా నిబంధనల ప్రకారం సంతాన సాఫల్యత చికిత్సలో భాగంగా నిషేధిత ఔషధాలు తీసుకునే మహిళా అథ్లెట్లు ముందుగా మినహాయింపు కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

నాదల్ వస్తున్నాడు

పారిస్ : స్పెయిన్ బుల్, 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ రఫెల్ నాదల్ పునరాగమనానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. హిప్ గాయంతో బాధపడుతున్న నాదల్.. ఇటీవల ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ మినహా ఎక్కడా రాకెట్ పట్టలేదు. ఏటీపీ కాంపిటీషన్ బార్సిలోనా ఓపెన్‌తో రఫెల్ నాదల్ రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ ఏడాది జనవరి తర్వాత నాదల్ ఆడనున్న తొలి టోర్నీ ఇదే కానుంది. జూన్‌లో 38వ వసంతంలోకి అడుగుపెట్టనున్న నాదల్.. గాయం నుంచి కోలుకుంటూ ఫ్రెంచ్ ఓపెన్‌లో చారిత్రక 15వ టైటిల్ సొంతం చేసుకునే దిశగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాడు. వచ్చే వారం ఆరంభం కానున్న బార్సిలోనా ఓపెన్‌లో నాదల్‌తో వరల్డ్ నం.63 కొబాలి పోటీపడనున్నాడు. కార్లోస్ అల్కరాజ్, డానిల్ మెద్వదేవ్ సైతం పోటీపడుతుండగా బార్సిలోనా ఓపెన్‌పై మరింత ఆకర్షణ వచ్చింది. గాయంతో 2023 సీజన్ మొత్తానికి దూరమైన నాదల్ కేవలం బ్రిస్బేన్ ఓపెన్‌లో మాత్రమే పోటీపడ్డాడు.








































Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.